సాక్షి ఒడిశా
బుధవారం । 11 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,68,375
బంగారం	7 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి	253 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



28 మృతదేహాలకు అంత్యక్రియలు

కోరమండల్ రైలు దుర్ఘటన సమయంలో గుర్తింపునకు నోచుకుని 28 మృతదేహాలకు మంగళవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

- 10లో▸



బహు రూపాల్లో శక్తి స్వరూపిణి

శక్తి పీఠాల్లో అమ్మవారు బహుళ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

- 10లో▸

న్యూస్‌రీల్

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా



జరిమానా వసూలు చేస్తున్న మున్సిపల్ ఉద్యోగి

జయపురం: రోడ్లపై ఇష్టారాజ్యంగా చెత్త, ఇతర వ్యర్థాలు పారబోస్తున్న వారికి జయపురం మున్సిపల్ అధికారులు జరిమానా విధిస్తున్నారు. ఈ క్రమంలో జయపురం హటొపాదర్ మార్గంలో టాటాషోరూం యాజమాన్యానికి రూ.2వేలు జరిమానా విధించినట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ మంగళవారం తెలిపారు. రోడ్డుపై ఎవరు చెత్త వేసినా జరిమానా తప్పదని హెచ్చరించారు. అందరి సహకారంతోనే పారిశుద్ధ్యం మెరుగవుతుందని చెప్పారు.

పది మంది జూదరుల అరెస్టు



గంజాం పోలీసులు సీజ్ చేసిన నగదు, ఫోన్లు

బరంపురం : కుమార పూర్ణిమ సందర్భంగా గంజాం జిల్లాల్లో పేకాటలు జోరుగా సాగుతున్నాయి. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పడి తనిఖీలు చేపడుతున్నారు. ఎస్పీ జగ్‌మోహన్ మీనా అందించిన సమాచారం ప్రకారం సోమవారం అర్ధరాత్రి జగనాత్ ప్రసాద్ పోలీసుస్టేషన్, హింజిలికాట్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు జూద శిబిరాలపై పోలీసులు దాడులు చేపట్టారు. 10 మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.11 వేల నగదు, 10 మొబైల్ ఫోన్లు, ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నారు.

ఘాట్‌రోడ్డులో ట్రక్ బోల్తా



బోల్తాపడిన ట్రక్

బరంపురం : గంజాం, గజపతి జిల్లాల సరిహద్దులో తప్తపాణి ఘాట్‌రోడ్డులో ట్రక్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో అవిభక్త గంజాం జిల్లా సరిహద్దు తప్తపాణి ఘాట్ రోడ్డు మీదుగా బరంపురం వైపు వెళ్తున్న భారీ ట్రక్కు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఖుర్దా జిల్లా జట్నీకి చెందిన డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరకుని క్షతగాత్రులను దిగపండి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో ట్రక్కును బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బృందావన్ నాయక్ ఆదర్శప్రాయుడు



బృందావన్ నాయక్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

బరంపురం : నేటితరానికి దివంగత బృందావన్ నాయక్ ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. బృందావన్‌నాయక్ స్మృతి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కొమ్మపల్లి జంక్షన్ వద్ద నాయక్ విగ్రహం వద్ద సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ముందుగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ బృందావన్ నాయక్ ఎన్నో ఉన్నత విద్యా సంస్థలు స్థాపించి భావితరాలకు ఉపకారం చేశారని కొనియాడారు. అనంతరం గిరి రోడ్ గీత భవన్‌లో భగవత్ గీత భజన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్ పండా, బరంపురం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, కమిటీ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ పండా, మాజీ ఎస్‌ఎంబీటీ చైర్మన్ భగవాన్ గంతాయత్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు.. బంగారు ఒడిశా

- నవ ఆకాంక్ష రాష్ట్ర నిర్మాణమే లక్ష్యం: సీఎం
- రెండు జిల్లాల్లో 'అమొ ఒడిశా, నవీన్ ఒడిశా' పథకం ప్రారంభం

భువనేశ్వర్: భావితరాలకు బంగారు ఒడిశాను అప్పగించడమే లక్ష్యంగా నవ ఆకాంక్షలతో కూడిన ఒడిశా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని, ఇందులో భాగంగానే 'అమొ ఒడిశా నవీన ఒడిశా' పథకం రూపుదిద్దుకుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. మౌలిక సదుపాయాల పెంపుదల, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉద్దేశించిన ఈ పథకాన్ని తొలి విడతగా రాష్ట్రంలోని కెంజొహర్, భద్రక్ జిల్లాల్లో సీఎం మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్‌మాట్లాడుతూ గ్రామాలు, పంచాయతీల అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయాల ప్రచారం, పరిరక్షణపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. రూ. 3,397 కోట్ల బడ్జెట్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 6,794 పంచాయతీల్లో 90,723 ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పథకంలో భాగంగా ప్రతి గ్రామానికి పది లక్షల రూపాయలు కేటాయిస్తామన్నారు. ప్రతి పంచాయతీకి రూ. 50 లక్షలు అందజేసి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అమూల్యమైన సంస్కృతి, సంప్రదాయం, చరిత్రాత్మక విలువలతో కూడిన రాష్ట్రంగా ఒడిశా ప్రత్యేకత సంతరించుకుందన్నారు. జగన్నాథ్ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన పవిత్ర భూమి ఒడిశా అని పేర్కొన్నారు. సార్వత్రిక ప్రేమ, సేవ, సమానత్వంపై ఆధారపడిన సంస్కృతి పునాదిగా, కులం, వర్గాలతో సంబంధం లేకుండా అందరినీ కలుపుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగడం ప్రపంచ మానవాళికి జగన్నాథ సంస్కృతి బోధిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రార్థనా స్థలాలు, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలను పరిరక్షించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నవీన ఒడిశా పథకం రాష్ట్రం శిఖరాగ్ర, సమగ్ర పురోగతికి దోహదపడుతుందన్నారు. యువత కోసం గ్రామాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీ, ఆట స్థలాలు, సైన్స్ పార్కులు అవసరమని చెప్పారు. వారికి శిక్షణ సౌకర్యాలు, వర్క్ హబ్‌ల ఏర్పాటుతో గ్రామీణ పారిశ్రామికవేత్తల్ని ఆవిష్కరించేందుకు, ముఖ్యంగా మహిళల్లో నైపుణ్యతకు పదును పెట్టే కేంద్రాలు అవసరమని పేర్కొన్నారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కొరత నివారించడం, బ్యాంకింగ్ సౌకర్యాలు కల్పించడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తేవడం, ఇతర ఆధునికీకరణ పనులను చేపట్టడం వంటి పనులు చేపట్టేందుకు 'అమొ ఒడిశా నవీన ఒడిశా' పథకం పంచాయతీలకు వెన్నంటి తోడ్పడుతుందని పేర్కొన్నారు. గ్రామ దేవాలయ పునరుద్ధరణ నుంచి భవిష్యత్ డిజిటల్ మౌలిక సదుపాయాలను నిర్మించడం వరకు అన్ని కీలకమైన పనులను ఈ పథకం కింద చేపట్టవచ్చన్నారు.



వర్చువల్‌గా అమొ ఒడిశా, నవీన్ ఒడిశా పథకం ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్

శ్రీమందిరంలో భక్తులకు డ్రెస్‌కోడ్

- జనవరి 1 నుంచి అమలు
- సంప్రదాయ వస్త్రధారణతో ధార్మిక విలువల పరిరక్షణ: సీఏఓ

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దర్శనానికి వచ్చే భక్తులకు సంప్రదాయ వస్త్రధారణను త్వరలో తప్పనిసరి చేయనున్నారు. డ్రెస్‌కోడ్ అమలుకు సంబంధించి కసరత్తు ఊపందుకుంది. ఒకే విధమైన రంగు, హంగులకు వస్త్రధారణ పరిమితం కాకుండా జాగ్రత్త వహిస్తున్నారు. అర్ధ నగ్న, అశ్లీల వస్త్రధారణ నివారణతో సాదాసీదా, ఆమోదయోగ్యమైన వస్త్రధారణ ప్రేరణకు పటిష్ట ప్రణాళిక రూపొందిస్తున్నారు. హాఫ్ ప్యాంట్, చినిగిన దుస్తులు, కురచ వస్త్రాలు, గౌన్లు అనుమతించరు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల పాటు చైతన్య, అవగాహన చర్యలు చేపడతారు. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

పెరిగిన ఫిర్యాదులు..

శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ రంజన్ కుమార్‌దాస్ మీడియాతో మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల వస్త్రధారణే ప్రధాన అంశంగా సమావేశం చర్చించినట్లు తెలిపారు. భక్తులు అసభ్యకరమైన దుస్తులు ధరించి స్వామి దర్శనం కోసం ఆలయానికి రావడంపై ఫిర్యాదుల తాకిడి పెరిగిందన్నారు. ఆలయ పవిత్రతను నీరుగార్చేలా పరిణమిస్తోందన్నారు.లక్షలాది మంది భక్తుల హృదయాల్లో ఆలయానికి ఉన్న గౌరవాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యతని చెప్పారు. దురదృష్టవశాత్తు కొందరు సందర్శకులు ఇతరుల మతపరమైన మనోభావాలను పట్టించుకోకుండా ఆలయాన్ని సందర్శిస్తున్నారని సీఏఓ తెలిపారు. చిరిగిన జీన్ ప్యాంట్లు, స్లీవ్‌లెస్ దుస్తులు, హాఫ్ ప్యాంట్‌లు ధరించి సముద్రతీరం, పార్కుల్లో విహరిస్తున్నట్లుగా ఆలయానికి వస్తున్నారని, దేవాలయం దేవుళ్ల నిలయం, మనోరంజక, వినోద కేంద్రం కాదని గుర్తించాలని హితవుపలికారు. ఈ నేపథ్యంలో భక్తులకు డ్రెస్ కోడ్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం మంగళ వారం నుంచి ప్రారంభమైందన్నారు.

కొత్త సంవత్సరం నుంచి కట్టుదిట్టం..

ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని జనవరి ఒకటో తేదీ నుంచి ఆమోదయోగ్యమైన వస్త్ర ధారణ తప్పనిసరి చేయనున్నట్లు సీఏఓ తెలిపారు. నియమావళి ఉల్లంఘిస్తే దర్శనానికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆలయంలోని సింహద్వారం వద్ద మోహరించిన జగన్నాథ ఆలయ పోలీసులు (జేటీపీ) సిబ్బంది, ఆలయం లోపల ఉన్న ప్రతిహారి సేవకులకు వస్త్ర ధారణ నియమావళి అమలు చేసే బాధ్యతను అప్పగించామన్నారు. ఈ నిబంధనల నుంచి 12 ఏళ్లలోపు వారికి మినహాయింపు కల్పించినట్లు తెలిపారు. స్లీవ్‌లెస్ వంటి అరకొర దుస్తులు, షార్ట్‌లు, చిరిగిన జీన్స్, స్కర్ట్‌లు, గౌన్లు, ఇతరేతర అభ్యంతరకర దుస్తులు ధరించిన వ్యక్తులను ఆలయంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. భక్తులు మర్యాదపూర్వక, సంప్రదాయ వస్త్ర ధారణతో స్వామిదర్శనానికి విచ్చేయాలని పిలుపునిచ్చారు. సీఏఓ అధ్యక్షతన ఆలయం కార్యాలయంలో జరిగిన సేవా సబ్ కమిటీ సమావేశంలో 36 నియోగుల సంఘం ప్రతినిధి జనార్దన్ పట్టజోషీ మహాపాత్రో, భిత్తరొచ్చొ భవానీ మహాపాత్రో, శ్రీ మందిరం పాలక మండలి నుంచి 5 మంది సేవాయత్ ప్రతినిధులు దుర్గాప్రసాద్ దాస్ మహాపాత్రో, అనంత్ తియాడి, మాధవ్ మహాపాత్రో, మాధవ్ పూజపండా సామంత, జగన్నాథ కొరొ, రాధా వల్లభ మఠం మహంత్ రామకృష్ణ దాస్ మహరాజ్, సేవా సబ్ కమిటీ సభ్యుడు రామచంద్ర దాస్ మహాపాత్రో పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న సేవా సబ్ కమిటీ సభ్యులు

పాముకాటుతో యువకుడికి అస్వస్థత

జయపురం: బొయిపరిగుడ సమితి చికాపూర్ పంచాయితీ ఝొడిగుడ గ్రామంలో పాముకాటుతో ఓ యువకుడు అస్వస్థతకు గురయ్యాడు. ఇక్కడి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంతోష‌కుమార్ బెహరా అనారోగ్యానికి గురికావడంతో అతని కుమారుడు ప్రశాంత కుమార్ బెహరా కుటుంబంతో కలిసి గంజాం నుంచి ఝొడిగుడ గ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో స్థానిక యువకులతో కలిసి బహిర్భూమికి వెళ్లగా చెరువు వద్ద పాముకాటు వేసింది. వెంటనే యువకుడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

3600 లీటర్ల సారా ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

బరంపురం : నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 3600 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఐఐసీ అధికారి అర్జున్‌కుమార్ మాలిక్ అందించిన సమాచారం ప్రకారం.. మంగళవారం దిగపండి పోలీసుస్టేషన్ పరిధిలోని కుమ్మజరి గ్రామ శివారు మొగలి పొదలో సారా తయారు చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. అదే విధంగా, కె.నువాగాం పోలీసుస్టేషన్ పరిధిలో చికిటి పెంట శివారులో నాటుసారా బట్టిని ధ్వంసం చేశారు. ఈ రెండు దాడుల్లో సుమారు 3600 లీటర్ల సారా ధ్వంసం చేసి సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కార్తీక పూజలకు సన్నాహాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని దేవస్థానంలో కార్తీక పూజల కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 నుంచి ప్రత్యేక కార్తీక పూజలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా బాల ధూపం, రాయ్ దామోదర సేవలు నిరవధికంగా చేపడతారు. ఆలయం ప్రధాన పాలన అధికారి సీఏఓ రంజన కుమార్ దాస్ అధ్యక్షతన జరిగిన సేవా సబ్ కమిటీ సమావేశంలో పూజల కార్యక్రమాలను ఖరారు చేశారు.

- ఏటా కార్తీక వ్రతం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా హిబిషాలీలు తండోప తండాలుగా శ్రీమందిరానికి తరలివస్తారు. రత్న వేదికపై కొలువుదీరిన దేవుళ్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. నిత్యం బాల ధూపం, రాయ్ దామోదర్ అలంకరణ చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రతి రోజూ ఉదయం 4 గంటలకు ద్వారాలు తెరుస్తారు. ఉదయం 5 గంటలకు మంగళ హారతి సమర్పిస్తారు.
- ఈ నెల 28న కుమార్ పూర్ణిమ సందర్భంగా సుదర్శన స్వామి 4 ఆశ్రమాల సందర్శన ఆచారంగా కొనసాగుతుంది. అదే రోజున చంద్ర గ్రహణం. ఈ నేపథ్యంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గ్రహణ స్పర్శ ప్రత్యేక సేవలు నిర్వహిస్తారు. అర్ధ రాత్రి ఒంటి గంట సమయంలో గ్రహణం వీడుతుంది. ఈలోగా అనుబంధ సేవాదులు పూర్తి చేయాలని నిర్ణయించారు.
- కుమార్ పూర్ణిమ ముందు రోజు రాత్రి 2 గంటలకు ద్వారాలు తెరుస్తారు. వేకువజామున 3 గంటలకు మంగళ హారతి సమర్పిస్తారు. సుదర్శన భగవానుని నాలుగు ఆశ్రమాల సందర్శన మినహా ఇతర పూజాదులు చేయరాదని నిర్ణయించారు. కేవలం సర్ప మణోహి సేవ మాత్రమే చేస్తారు. 2014లో కూడా చంద్ర గ్రహణం కారణంగా సుదర్శన భగవానుడి సర్ప మణోహి సేవతో పరిమితం చేశారు.
- ఈ ఏడాది ముగిసిన రథయాత్ర, స్నాన యాత్రలో పలు వర్గాలు క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారు. దీనికి సంబంధించి సేవా సబ్ కమిటీ సమావేశంలో సమీక్షించేందుకు వీలు కాలేదు. త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఆ సమావేశంలో వీడియో ఫుటేజీని సమావేశంలో ప్రదర్శిస్తారు. దీని ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సేవా సబ్ కమిటీ సభ్యుడు రామచంద్ర దాస్ మహాపాత్రో తెలిపారు.

రాయగడ బీడీఓగా అమూల్యకుమార్



అమూల్యకుమార్ సాహూ

రాయగడ: రాయగడ బీడీఓగా అమూల్య కుమార్ సాహూ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బీడీఓగా పని చేసిన లక్ష్మీనారాయణ సాబొతొ బదిలీ అయ్యారు. ఈయన స్థానంలోజగత్సింగ్‌పూర్ జిల్లా తిర్తొల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సాహూ బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఐదు టిఫిన్ బాంబులు స్వాధీనం





డిటెక్టర్ ద్వారా గుర్తిస్తున్న జవాన్, (ఇన్‌సెట్లో) ఐదు టిఫిన్ బాంబులు ఇవే

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియ సమితిలో కూమార్ గూఢ అడవిలో 142 బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవాన్లు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ చోట టిఫిన్ బాంబులు గుర్తించారు. వెంటనే బాంబ్ స్క్వాడ్‌ను పిలిపించి ఐదు టిఫిన్ బాంబులను వెలికితీశారు. జవాన్లను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులే వీటిని అమర్చి ఉంటారని అనుమానిస్తున్నారు. చెట్టు కిందిభాగంగా అమర్చిన ఈ బాంబును డిటెక్టర్ ద్వారా గుర్తించి అప్రమత్తమయ్యారు. ఇంకా కూంబింగ్ కొనసాగుతోంది.

రైల్‌కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

- రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ప్రారంభించిన మంత్రి జగన్నాథ సరక



అందంగా కనిపిస్తున్న కోచ్

రాయగడ : రాష్ట్రంలో ప్రథమంగా రాయగడ పట్టణంలో రైల్వేశాఖ ద్వారా రైల్‌కోచ్ రెస్టారెంట్ సేవలు ప్రారంభించడం హర్షణీయమని రాష్ట్ర ఆదివాసీ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో మంగళవారం రైల్‌కోచ్ రెస్టారెంట్‌ను మంత్రి సరక, రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులతో పాటు ప్రతిఒక్కరూ రెస్టారెంట్‌లో రుచులు ఆస్వాదించవచ్చన్నారు. రూ.15 లక్షలకు లీజుకు తీసుకున్న ఈ రెస్టారెంట్‌లో అన్ని రకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు కామేష్ తెలిపారు. రైల్వేశాఖ కోచ్‌ను సమకూర్చగా, రూ.40 లక్షలు వెచ్చించి సదుపాయాలు కల్పించామని, ఒకేసారి 42 మంది భోజనం చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు విందు ఆరగించారు.



రెస్టారెంట్ కోచ్ లోపలి భాగం



ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

140 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఛకాలగుండి వద్ద మంగళవారం 140 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ కారు అతివేగంగా రావడం చూసి ఆపారు. లోపల తనిఖీ చేయగా గంజాయి బస్తాలు గుర్తించారు. వెంటనే కారులో ఉన్న మోటు, మిద్దులను అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గంజాయి తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం



చెరుకూరి గున్నమ్మ (ఫైల్)

బూర్జ : మండలంలో గల సింగన్నపాలెం గ్రామ వెనుక భాగాన ఉన్న చెరువులో ఓ వృద్ధురాలి మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. స్థానిక పోలీసు లు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలస వెంగళరావు కాలనీకి చెందిన చెరుకూరి గున్నమ్మ(60) శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆ రోజు రాత్రి ఉప్పినివలస గ్రామంలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆది, సోమవారాలు ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఇంతలోనే మంగళవారం సింగన్నపాలెం చెరువులో ఆమె మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక్క కూతురు ఉన్నారు. అందరికీ వివాహమైంది. గున్నమ్మకు మూడేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త చెరుకూరి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్‌ఐ బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జితేంద్ర మిశ్రో

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధి మండపా లం కాలనీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలనీకి చెందిన జితేంద్ర మిశ్రో (44) అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండపాలం కాలనీలో నివాసముంటున్న జితేంద్ర మిశ్రో స్థానిక పెట్రోల్ బంకులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి తన ఇంటి వద్ద నుంచి ద్విచక్రవాహనంపై వ్యతిరేక మార్గంలో (రాంగ్ రూట్) తాను పనిచేస్తున్న పెట్రోల్ బంకువైపు వెళ్తుండగా అదే మార్గంలో టెక్కలి నుంచి నందిగాం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జితేంద్ర మిశ్రోకి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ ఎల్ రామకృష్ణ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



కొత్తమ్మ తల్లి ఉత్సవాలపై సమీక్ష చేస్తున్న టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్ తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సబ్‌కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. క్యూలైన్‌లు, తాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణపై యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసి తనకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, సర్పంచ్ కాల్ల సంజీవరావు, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్, డీటీ మధు, టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్‌ఐ మహ్మద్ అలీ, డీఎల్‌పీఓ ఐవీ రమణ, ఆర్‌అండ్‌బీ డీఈ రమణమూర్తి, జేఈ సరోజ పాల్గొన్నారు.

బహు రూపాల్లో శక్తి స్వరూపిణి



కాళీ అలంకరణలో కటక్ గొదొ చండీ అమ్మవారు



దశ భుజి అలంకరణలో చవులియా గంజ్ జయదుర్గ అమ్మవారు



వైష్ణవి అలంకరణలో ఫిరాపూర్ ధకులై మాత

షోడశ దినాత్మక పూజలు సందర్భంగా పలు శక్తి పీఠాల్లో అమ్మవారు బహురూపాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాష్ట్రంలో ప్రముఖశక్తి పీఠాల్లో ఆరాధ్య శక్తి స్వరూపిణిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. - భువనేశ్వర్



సిద్ధేశ్వరి అలంకరణలో కటక్ చండీ మాత



మాతా అన్నపూర్ణ శోభతో ఝంజిరి మంగళాదేవి



బొగొలాముఖి రూపంలో మాతా వాసంతి దుర్గ



మంగళాదేవి అలంకరణలో గొదొగొడియా దక్షిణ కాళీమాత



జయదుర్గ అలంకరణలో పూరీ చార నారాయణి అమ్మవారు

దర్శన సమయంలో కుప్పకూలిన భక్తుడు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని ఆలయంలో స్వామిని దర్శించుకున్న సమయంలో ఓ భక్తుడు అకస్మాత్తుగా కుప్పకూలాడు. బహారొ కఠొ వద్ద నిలబడి ఉండగా అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతరం శ్రీమందిరం అంబులెన్సులో పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని అప్పగించాలని బంధువులు అధికార యంత్రాంగాన్ని అభ్యర్థించారు. మృతుడు ఉత్తర ప్రదేశ్ ఝాన్సీ ప్రాంతానికి చెందిన రేయన్ ప్రసాద్ సేన్ (65)గా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



భానుప్రసాద్ మిశ్రా మృతదేహం

జయపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తితో పాటు ఆవు దుర్మరణం చెందినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భానుప్రసాద్ మిశ్రా(24) అనే వ్యక్తి బైక్‌పై బొయిపరిగుడ సమితి కమత నుంచి బొరిగుమ్మ మీదుగా జయపురం వస్తుండగా జయపురం సదర్ పోలీసు స్టేషన్ సమీపంలో పెట్రోలు బంకు వద్ద ఆవుని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భానుప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆవు సైతం మరణించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ నవీన చంద్ర చౌధురి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒత్తిడి వీడితేనే మానసిక ప్రశాంతత



మల్కన్‌గిరి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

రాయగడ: మానసిక ఒత్తిడి వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, ప్రశాంతంగా ఉంటేనే ఆరోగ్యం సమకూరుతుందని డాక్టర్ ప్రదీప్‌కుమార్ సుబుద్ధి అన్నారు. స్థానిక రాయగడ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ బబిలత షరఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మానసిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వ్యాధి నుంచి ఉపశమనం పొందే చిట్కాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మమత చౌదురి, డాక్టర్ వేణుధర్ నాయక్, డాక్టర్ రంజన్ మహంతి తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: ప్రసంగిస్తున్న డాక్టర్ సుబుద్ధి

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర ప్రధాన వైద్యాధికారి కీరోద్ చంద్రమహంతి మాట్లాడుతూ మానసిక ఆందోళన, ఒత్తిడికి దూరమయ్యే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రకాష్ సాహు, జ్యోతి ప్రకాష్, జాస్మిన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బీజేడీ జనసంపర్క పాదయాత్ర



పాదయాత్రలో బీజేడీ నాయకుడు రూపేష్ పాణిగ్రాహి, నాయకులు

పర్లాకిమిడి: కాశీనగర్ ఎన్‌ఏసీలో మంగళవారం బీజేడీ పార్టీ జనసంపర్క పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. బస్టాండ్ నుంచి ఫారెస్టు గేటు మీదుగా 14 వార్డుల్లోనూ యాత్ర కొనసాగింది. ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ అమలు చేస్తున్న వివిధ పథకాల అమలును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బీజేడీ జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువనాయకులు రూపేష్ పాణిగ్రాహి, కాశీనగర్ ఎన్‌ఏసీ చైర్‌పర్సన్ మేడిబోయిన సుధారాణి, వైస్ చైర్మన్ రఘురాం సాహు, కాశీనగర్ బీజేడీ అధ్యక్షుడు రొక్కం చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి బసంత్ దాస్, మారుత్ పాలో, యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



కాశీనగర్ ఎన్‌ఏసీలో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

28 మృతదేహాలకు అంత్యక్రియలు

- కోరమండల్ రైలు దుర్ఘటన సమయంలో గుర్తింపు
- హక్కుదారులు లేకపోవడంతో ఇన్నాళ్లూ ఎయిమ్స్‌లో భద్రపరిచిన వైనం
- గడువు ముగియడంతో దహన ప్రక్రియ ప్రారంభం



ఎయిమ్స్ శీతల శవపేటికల నుంచి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో ట్రిపుల్ రైలు(కోరమండల్) దుర్ఘటన భారతీయ రైల్వే చరిత్రలో భయానక ఘట్టంగా మిగిలి పోయింది. తదనంతరం హక్కుదారులు ముందుకు రాకపోవడంతో 28 మంది దుర్మరణం మరింత హృదయవిదారకమైంది. వీరి మృతదేహాల్ని ఇన్నాళ్లూ స్థానిక ఎయిమ్స్ ప్రాంగణంలో అత్యంత శక్తివంతమైన శీతల శవపేటికలో భద్రపరిచారు. వీటి దహనకాండ ప్రక్రియని మంగళవారం నుంచి ప్రారంభించారు. రైలు దుర్ఘటన దర్యాప్తు బృందం సీబీఐ అధికార వర్గాల సమక్షంలో ఈ ప్రక్రియని చేపట్టారు. స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ మృతదేహాల తరలింపు కోసం ప్రత్యేక వాహనాలను సిద్ధం చేసింది. నగర పరిధిలోని పలు శ్మశాన వాటికల్లో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసింది. సీబీఐ వర్గాల సమక్షంలో ఎయిమ్స్ అధికార వర్గాలు మృతదేహాల్ని బీఎంసీకి అప్పగించడంతో దహనకాండ ప్రక్రియ ఊపందుకుంది. ఈ ఏడాది జూన్ 2 నాటి ఘోర రైలు ప్రమాదం తర్వాత 162 మృతదేహాలను స్థానిక ఎయిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయ రైల్వే చరిత్రలోనే అత్యంత ఘోరమైనదిగా పరిగణిస్తున్నారు.

ఈ ప్రమాదంలో 296 మంది దుర్మరణం పాలయ్యారు. 1,000 మందికి పైగా గాయపడ్డారు. తొలి దశలో 81 మృతదేహాల్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం మరో 53 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన 28 మృతదేహాలకు సరైన హక్కుదారులు రాలేదు. పారాదీప్ పోర్ట్ ట్రస్ట్ నుంచి సేకరించిన 5 డీప్ ఫ్రీజర్ కంటైనర్లలో ఈ మృతదేహాలను పదిలపరిచారు. ఈ నెల 8న సీబీఐ నుంచి అనుమతి లభించడంతో దహన సంస్కారాలకు సిద్ధం కావాలని ఖుర్దా జిల్లా అధికార యంత్రాంగం స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీకి లేఖ రాసింది. హక్కుదారులు కొరవడిన 28 మృతదేహాలకు శాస్త్రీయంగా దహనకాండ చేసేందుకు నడుం బిగించారు. ఈ ప్రక్రియ కోసం బీఎంసీ ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) జారీ చేసింది. నగరంలోని భరత్‌పూర్, సత్యనగర్, ఇతర శ్మశానవాటికలలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నట్లు భువనేశ్వర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ్ అమృత కులంగే ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తున్నారు.

జయపురంలో డీజీపీఎస్ సర్వే



రైస్‌రీసెర్చ్- బెల్ రోడ్డులో డ్రైన్ పరిశీలిస్తున్న దృశ్యం



పట్టణంలో డ్రైనేజీ లోతును పరిశీలిస్తున్న సర్వే బృందం

జయపురం: పట్టణంలో వర్షపు నీరు వరద నీరు సజావుగా వెళ్లేందుకు డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిసిన్ సిస్టమ్(డీజీపీఎస్) సర్వే చురుగ్గా సాగుతోంది. కోల్‌కతాకు చెందిన ప్రత్యేక బృందం ఐదు ప్రధాన డ్రైన్‌లతో పాటు ఇతర కాలువలను పరిశీలిస్తోంది. ఇందుకు రూ.38.77 కోట్లు వెచ్చిస్తున్నట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ తెలిపారు. డ్రైన్ వెడల్పు, పొడవు, లోతు, వర్షపు నీరు ఎంత సమయంలో కిందకు పోతుంది తదితర వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. తుది నివేదిక వచ్చాక ప్రభుత్వానికి రిపోర్టు అందజేస్తామన్నారు.

దసరా ఉత్సవాలకు ముస్తాబు



ముఖద్వారాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

జయపురం: దసరా ఉత్సవాలకు జయపురం 26వ జాతీయ రహదారిలోని ప్రైవేట్ బస్టాండ్ కూడలి ముస్తాబవుతోంది. ఏటా ఈ ప్రాంతంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా వైభవంగా నిర్వహించేందుకు ప్రైవేటు బస్సు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు.



దుర్గాదేవి కొలువుదీరనున్న మండపం

లారీ బోల్తా

సారవకోట: మండలంలోని కురిడింగి గ్రామానికి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున సిమ్మెంట్‌తో వస్తున్న లారీ పొలంలోకి వెళ్లి బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి ఒడిశాలోని పర్లాకిమిడి సిమ్మెంట్ బస్తాల తో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పొలాలలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అయితే లారీ డ్రైవర్ హేమంత్ సోయి ప్రమాదాన్ని గుర్తించి గెంతేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.



పొలాల్లో బోల్తాపడిన లారీ

వివాహిత మృతిపై ముమ్మర దర్యాప్తు



పరశురాంపురంలో అశ్విని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, తహసీల్దార్ సరోజిని



పరశురాం పురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వాసుదేవరావు

మెళియాపుట్టి: ముకుందాపురం పంచాయతీ పరిధిలోని పరశురాంపురం గ్రామానికి చెందిన వివాహిత జన్ని అశ్విని(21) మృతిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. అశ్విని భర్త జన్ని కృష్ణారావు అదనపు కట్నం కోసం తరచూ గొడవ పడుతూ ఉండేవాడని, అత్తమామలు, ఇద్దరు ఆడపడుచులు సైతం బంగారు గొలుసు, ద్విచక్ర వాహనం తీసుకురావాలని వేధిస్తూ ఉండేవారని మృతురాలి తల్లి చీర కాంతమ్మ చెబుతున్నారు. పెళ్లయిన నాటి నుంచి ఎలాంటి సారె సామాన్లు తీసుకురాలేదంటూ ఇబ్బందులకు గురిచేసే వారని, పలుమార్లు ఫోన్ చేసినా అల్లుడు కృష్ణారావు మాట్లాడేవారు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన తర్వాత కూడా పాము కరిచిందని తప్పుడు సమాచారం ఇచ్చారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్‌ఐ రాజేష్, సీఐ వినోద్‌బాబుతో కలిసి టెక్కలి డీఎస్పీ వాసుదేవరావు పరశురాంపురం గ్రామాన్ని సందర్శించి అశ్విని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సూపర్ వాస్మోల్ 33 సీసాలు మృతురాలు బహిర్భూమి కోసం వెళ్లిన చోట దొరికాయని తెలిపారు. తహసీల్దార్ సరోజిని గ్రామాన్ని సందర్శించి మృతిపై ఆరా తీశారు. మంగళవారం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టెక్కలి డీఎస్పీ వాసుదేవరావు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి కాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

12న అండర్-19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 12న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో చెస్, ఫెన్సింగ్, కరాటే, బాల్‌బ్యాడ్మింటన్, బేస్‌బాల్, యోగా క్రీడాంశాల్లో బాల, బాలికలకు ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో 8,9,10 తరగతులు చదువుతున్న వారితో పాటు 19 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులుగా తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆ రోజు జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

13న జాబ్ మేళా

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ)ల ఆధ్వర్యంలో ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్.కేశవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యేందుకు పదవ తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల విద్యార్థులందరూ అర్హులేనని పేర్కొన్నారు. విద్యార్థులు వారి విద్యార్హత, కులం, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాలు తీసుకుని సెమినార్ హాల్‌కు హాజరు కావాలని స్పష్టం చేశారు. జాబ్‌మేళాలో ఏటీసీ టైర్స్, అరబిందో ఫార్మా, సెనస్టిక్స్ ల్యాబ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, జయభేరి ఆటోమోటివ్స్, రాండ్‌స్టాండ్, నవత ట్రాన్స్‌పోర్ట్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, స్మార్ట్ సర్వీసెస్ కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7995691295 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రె పిల్లలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట గ్రామంలో వీధి కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన బూర సోములు ఇటీవల వారపు సంతలో 20 గొర్రె పిల్లలను జీవనోపాధికోసం కొనుగోలు చేశాడు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కుక్కల గుంపు గొర్రె పిల్లలపై దాడిచేయగా 15 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో నాలుగు పిల్లలు గాయాల పాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ.లక్ష విలువైన గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతిచెందడంతో బాధితుడు లబోదిబోమంటూ రోదిస్తున్నాడు. ఇప్పటికైనా కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని, బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

8 తులాల బంగారం చోరీ



చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ ఎస్సై స్వరూప్

సీతానగరం: మండలకేంద్రంలోని ఒక ఇంటిలో 8 తులాల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు మంగళవారం బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం గ్రామానికి చెందిన యల్లామంతి వెంకటరమణ(రిటైర్డ్ ఆర్ఎస్సై) జూన్‌నెలలో హైదరాబాద్‌లో ఉన్న కుటుంబసభ్యుల దగ్గరికి వెళ్లారు. హైదరాబాద్ నుంచి తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు విరగ్గొట్టి బయట పడవేసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లగా బీరువా, సెల్ఫ్‌లలో పెట్టెలు వంటింట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న సుమారు 8తులాల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.నీలకంఠం తెలియజేశారు.

ఏడుగురు పేకాట రాయళ్ల అరెస్టు

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో మంగళవారం దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.8,950 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పాడిపంటలతో ఆర్థికాభివృద్ధి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- మూగజీవాల వైద్యం కోసం అంబులెన్స్‌లు
- పాడి పశువులకు బీమా సదుపాయం
- కర్లాంలో పశువైద్య శిబిరం ప్రారంభం



బ్యాంక్ లింకేజీ చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



పశుధన్ జాగృతి అభియాన్ పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చిత్రంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ప్రతి ఒక్కరూ పాడి, పంటలతోనే ఆర్థికంగా అభివృద్ధి చెందగరలని అందుకనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాడి సంపద అభివృద్ధి, పాడి రైతులకు తోడ్పాట్లు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామంలో ఏర్పాటు చేసిన పశుధన్ జాగృతి అభియాన్‌లో భాగంగా పశువుల్లో పునరుత్పత్తి, ఫలదీకరణపై నిర్వహించిన అవగాహన వైద్య శిబిరాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, పలువురు పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో ప్రతి ఇంటికీ పశుసంపద ఉండేదని మారుతున్న కాలంతో పాటు పాడి సంపద తగ్గిపోయిందన్నారు. అందుకనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ వంటి దిగ్గజ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు అండగా నిలిచారని చెప్పారు. మనుషులతో సమానంగా మూగ జీవాలకు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పశు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారన్నారు. 24 గంటల్లో ఎప్పుడు పాడి పశువులకు ఎలాంటి కష్టం వచ్చినా 1962 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణమే పశు అంబులెన్స్ వచ్చి వైద్యం అందిస్తుందని చెప్పారు. పశు అంబులెన్స్ ఉచిత నంబర్ 1962 నంబర్‌ను గ్రామాల్లో ప్రచారం చేస్తూ ఎక్కడిక్కడే గోడలపై రాయించాలని పశువైద్యాధికారులకు సూచించారు. అలాగే మూగ జీవాలకు బీమా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. అందులో భాగంగా పాడి రైతు నామమాత్రపు ప్రీమియం క్రింద రూ.400 చెల్లిస్తే మిగిలిన డబ్బు ప్రభుత్వమే భరించి, పాడి పశువుకు ఎలాంటి ప్రమాదం జరిగి మరణించినా రూ.30 వేల వరకు బీమా లభిస్తుందని వివరించారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా..

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూగజీవాలకు అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ సదుపాయాన్ని తీసుకొచ్చారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు ఎక్కడా లేదన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రాయితీపై దాణా ఇస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సిమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన రావు, సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బాణాన రామరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ పతివాడ రాజారావు, బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(సీవీఎస్) అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, హెచ్ఓడీలు డా.కె.శ్రీనివాసరావు, ప్రభాకర్, శ్రీలత, మనోజ్, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ.రమణ, ఎ.డి ఆర్.శారద, పశువైద్యాధికారి విజయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలు ఆర్థికంగా ఎదగాలి

చీపురుపల్లి: స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు అన్నారు. ఈ మేరకు చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామంలో గల ఇండియన్ బ్యాంక్ పరిధిలో 45 స్వయం సహాయక సంఘాలకు రూ.8.10 కోట్లు బ్యాంక్ లింకేజీ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఒకేసారి రూ.8 కోట్లు రుణాలు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందజేస్తోందని చెప్పారు. బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగించాలని మహిళా సంఘాలకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని కోరారు. రుణమాఫీ పేరుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాలుగు దశల్లో రుణమాఫీ చేసి చూపించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే 45 ఏళ్లు పైబడిన మహిళలకు వైఎస్సార్ చేయూత పేరుతో ఏటా ఆర్థిక ఆసరా అందజేశారన్నారు.

36 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్



సీతానగరం: మద్యసీసాలతో నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై పోలీస్ సిబ్బంది మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఒక్కొక్కరు 18 వంతున 36 మద్యం సీసాలతో పట్టుబడినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు, వాహనాలపై గతంలో వేసిన అపరాధ రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించక పోవడంతో వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. గతంలో వాహనాలపై పెండింగ్‌లో ఉన్న అపరాధరుసుము ఆన్‌లైన్‌లో చెల్లించి పోలీసువారికి సహకరించాలని కోరారు. ఈ క్రమంలో చినభోగిలి గ్రామానికి చెందిన వ్యక్తుల బ్యాగ్‌లను సోదాలు చేసి మద్యం సీసాలున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

7 మద్యం సీసాలతో మరో వ్యక్తి..

విజయనగరం క్రైమ్: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో కణపాక వద్ద మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. దాడుల్లో ఎస్సై జాన్‌ప్రసాద్, హెచ్‌సీ ధనరాజు, కానిస్టేబుల్ గంగాధరుడు తదితరులు పాల్గొన్నారు.

గొటివాడలో క్షుద్ర పూజల కలకలం

- ఆరుగురిని పట్టుకున్న గ్రామస్తులు



శ్మశాన వాటికలో క్షుద్ర పూజలు చేస్తూ పట్టుబడిన వ్యక్తులు

కురుపాం: మండలంలోని గొటివాడ గిరిజన గ్రామంలో సోమవారం అర్ధరాత్రి క్షుద్రపూజల కలకలం రేగింది. ఒడిశా, తదితర గ్రామాల నుంచి నాలుగు మోటార్ వాహనాలపై 9 మంది వచ్చి గ్రామ సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద పసుపు, కుంకుమ, కత్తులతో పూజలు చేస్తుండడాన్ని గ్రామానికి చెందిన వారు గుర్తించి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వారిలో ముగ్గురు వ్యక్తులు తప్పించుకుని పారిపోగా ఆరుగురిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కురుపాం ఎస్సై సీహెచ్ ప్రసాద్ మంగళవారం గ్రామానికి వెళ్లి మూఢనమ్మకాలు, చిల్లంగి, చేతబడిపై అవగాహన కల్పించారు.

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: ఆధార్, పాన్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని వచ్చిన మెసెజ్‌కు స్పందించి లింక్ ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకున్న ఓ బాధితుడు టూటౌన్ పోలీసులను మంగళవారం ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాబామెట్టలోని ఐశ్వర్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వి.నాగేశ్వరరావుకు యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ ఉంది. మంగళవారం ఆయన మొబైల్‌కు మీ అకౌంట్ తాత్కాలికంగా బ్లాక్ అవుతుంది. పాన్, ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని లింక్ వచ్చింది. దీంతో లింక్ ఓపెన్ చేసి, అడిగిందల్లా టైప్ చేసి, వచ్చిన ఓటీపీలను ఎంటర్ చేశాడు. అంతే అకౌంట్ నుంచి రూ.2 లక్షల 65 వేలు దఫదఫాలుగా విత్‌డ్రా అయిపోయాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ విజయానంద్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: సెల్‌ఫోన్ షాపులోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్‌లను పట్టుకుని పరారైన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గురజాడ అప్పారావు రోడ్డులో బొంతు రాజేష్ అనే వ్యక్తి ప్లే స్టోర్ మొబైల్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. జూలై 23న షాపును మేనల్లుడు గౌతమ్‌కు అప్పగించి బయటకు వెళ్లాడు. కొద్ది సమయం తర్వాత గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి, షాపులోపలికి ప్రవేశించి, గౌతమ్ నుదుటిపై కొట్టి, కళ్లల్లో స్ప్రే చేసి, షాపులో ఉన్న వివో, శ్యామ్‌సంగ్ కంపెనీలకు చెందిన రెండు మొబైల్స్‌ను తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించి దుప్పాడ గ్రామానికి చెందిన గండిపల్లి ప్రసాద్‌ను నిందితుడిగా గుర్తించారు. అక్టోబరు 9న నిందితుడి సమాచారం అందడంతో పంచముఖ హనుమాన్ ఆలయం వద్ద అరెస్టు చేసి, రెండు సెల్‌ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్సై వి.అశోక్ కుమార్, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

హోరాహోరీగా మహిళల క్రికెట్ టోర్నీ

- మధ్యప్రదేశ్, అసాం, బరోడా జట్ల విజయం



ఎన్‌సీఏ మైదానంలో బీహార్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్



సర్ విజ్జీ మైదానంలో కేరళ, బరోడా జట్ల మధ్య మ్యాచ్

విజయనగరం రూరల్: భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ నెల 8న ప్రారంభమైన అంతర్ రాష్ట్ర అండర్-19 మహిళల వన్డే క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో బీహార్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు 40.2 ఓవర్లలో 63 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ కాగా, 64 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన మధ్యప్రదేశ్ జట్టు వికెట్ నష్టపోకుండా 10 ఓవర్లలోనే సునాయాసంగా విజయలక్ష్యాన్ని చేరుకుంది.

ఉత్కంఠ పోరు

విజయనగరం జిల్లా కేంద్రం శివారు సర్ విజ్జీ క్రికెట్ మైదానంలో బరోడా, కేరళ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు సాధించగా 187 విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బరోడా జట్టు బ్యాటర్లు 35.1 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 187 పరుగులు చేసి విజయాన్ని అందుకున్నారు.

78 పరుగుల తేడాతో మిజోరం ఓటమి

అలాగే దాకమర్రి సమీపంలోని కందుకూరి క్రికెట్ మైదానంలో మిజోరం, అసోం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన అసోం జట్టు 50 ఓవర్లలో 236 పరుగులు చేసి, ఆలౌట్ కాగా, 237 పరుగల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన మిజోరం జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 158 పరుగులే చేసి 78 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు

పార్వతీపురంటౌన్: విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు శ్రమను ఆయుధంగా మలుచుకుంటే విజయం సొంతమవుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస వద్ద చౌక ధరల దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రం, మున్సిపల్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా పదార్థాలను వడ్డించారు. స్టోర్ రూంలో సరుకుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని హితవు పలికారు. విద్యార్థి దశలో వాక్పటిమ, భావ వ్యక్తీకరణ నైపుణ్య ఎంతో కీలకమని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి విద్యా రంగం అంటే అమితమైన ప్రేమ ఉందన్నారు. పేదరికం, అనారోగ్యంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే దృఢమైన సంకల్పంతో ప్రభుత్వం అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, ఉన్నత విద్యలు అభ్యసించేందుకు విదేశీ విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద వంటి బృహత్తర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని ఐక్య రాజ్య సమితి సభలో ప్రసంగించడాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆసక్తి కలిగిన రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్.శివ ప్రసాద్, డీఎం ఎం.దేవుళ్ల నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు, జిల్లా మధ్యాహ్న భోజన పథకం సహాయ సంచాలకుడు పి.దామోదర రావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య, జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె.రత్నరాజు, ప్రధానోపాధ్యాయుడు జి.విశ్వం, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు



సన్యాసిరాజుపేటలో జేఏఎస్ శిబిరంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం గరుగుబిల్లి మండలంలోని పెదగుడబ సచివాలయ పరిధి సన్యాసిరాజుపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను, శిబిరాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని గ్రామంలోనే అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు భరోసాగా నిలుస్తాయని, గ్రామీణ పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. పైడితల్లి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో సామూహిక గృహప్రవేశం రేపు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న శంబంగి తదితరులు



జగనన్న కాలనీ ఆర్చ్

బొబ్బిలి: రాష్ట్రంలోని జగనన్న కాలనీల్లో 5లక్షల పైచిలుకు జగనన్న గృహాలను సామూహికంగా ప్రారంభించేందుకు ఈనెల 12న ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు బొబ్బిలి పట్టణంలోని ఐటీఐ కళాశాల ఎదురుగా ఏర్పాటైన 360 గృహాల జగన్న కాలనీలో 188 గృహాలను సామూహికంగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మంగళవారం కాలనీకి వెళ్లి ప్రారంభానికి అవసరమైన వేదిక, పరిసరాలను పరిశీలించారు. సామర్లకోటలో ప్రారంభమయ్యే సమయంలోనే ఇక్కడ కూడా గృహప్రవేశాలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు, కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. సాయంత్రం హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు కాలనీకి వచ్చి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ దక్షిణామూర్తి, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై విచారణ



దర్యాప్తు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల/పాఠశాలలో ఏడాది క్రితం గురుకుల సొసైటీ నుంచి కానీ, రెవెన్యూ అధికారుల నుంచి కానీ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల ఆవరణలో ఉన్న టేకు చెట్ల నరికివేతపై గతేడాది సెప్టెంబర్‌లో కళాశాలలో పనిచేసిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అటవీశాఖాధికారులకు, గురుకులం సొసైటీ అధికారులకు ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ ఫిర్యాదుపై అటవీశాఖ సూపర్‌వైజర్ ఎం.మనోజ్ కుమార్ మంగళవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రిన్సిపాల్ సంధ్యారాణి మాట్లాడుతూ గురుకులంలో భవన నిర్మాణానికి చెట్లు అడ్డంగా ఉన్నాయని అప్పటి ప్రిన్సిపాల్ శ్రీదేవి చెట్లు, కొమ్మలు నరికి వేసినట్లు తీర్మానం చేసినట్లు చెప్పారు. చెట్ల నరికివేతపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ చెట్ల నరికివేతపై సిబ్బందితో చర్చించి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో సిబ్బంది పి.కృష్ణారావు, జి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరత్నం తదితరులున్నారు.

పుస్తెల తాడు చోరీ

విజయనగరం క్రైమ్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో ఉన్న పుస్తెల తాడును వెనుక నుంచి వచ్చిన వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు.. ప్రదీప్ నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గౌరీ అనే మహిళ పక్క అపార్ట్‌మెంట్‌లో దుస్తులు ఇస్త్రీ చేసేందుకు నెత్తిమీద మూటపెట్టుకుని మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వెళ్తుంది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన వ్యక్తి ఆమె మెడలో ఉన్న సు మారు రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని అప్పటికే సమీపంలో బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

సెల్‌ఫోన్లు చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెంలో ఉన్న శ్రీ లక్ష్మీ సాయిరామ్ లేడీస్ హాస్టల్‌లో రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. స్థానిక తోటపాలెంలో ఉన్న హాస్టల్‌లో ఈ నెల 5వ తేదీ రాత్రి దొంగలు చొరబడి గదిలో ఉన్న ఇద్దరు మహిళల సెల్‌ఫోన్‌లు దొంగలించారు. ఉదయం లేచి చూసేసరికి తమ మొబైల్స్ కనబడకపోవడంతో వార్డెన్‌కు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గదులన్నీ వెతికినా ఎక్కడా లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక అంశాలను వెల్లడిస్తున్న డాక్టర్ అర్చన వి.జైన్

విజయనగరం టౌన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అర్చన వి.జైన్ (నాగ్‌పూర్) పేర్కొన్నారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీతో) విజయనగరం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక తోష్నీవాలా భవన్‌లో ఆధ్యాత్మిక అంశాలను, యోగా, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా వింగ్ ఆధ్వర్యంలో నూతనంగా జిల్లా శాఖ రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తొలి కార్యక్రమాన్ని భక్తాంబర్ మంత్ర ద్వారా నిర్వహించుకోవడం మహిళల సంతోషానికి అవధుల్లేవన్నారు. ఈ సందర్భంగా మెడిటేషన్‌పై పలు విషయాలను వెల్లడించారు. నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షురాలు రీమా కొఠారి, ఉపాధ్యక్షురాలు జ్యోతి బచావత్, కార్యదర్శిగా హర్షితా సురానాలు ఎంపికయ్యారు. వీరి ఆధ్వర్యంలో 34 సభ్యులను ఎన్నుకున్నారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్స్, జైన్స్ వింగ్స్, ప్యాట్రన్ మెంబర్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో జైన్ సంఘ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.